క్లుప్తంగా

మరిడిమాంబను దర్శించుకున్న అమర్‌నాథ్


కొండెంపూడిలో మరిడిమాంబ సన్నిధిలో అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట : కొండెంపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన మరిడిమాంబ ఆలయాన్ని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. మంగళవారం ఆయన మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కొండెంపూడి వెళ్లి మరిడిమాంబను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు లలితా నారాయణమూర్తి, చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జనార్దనరావు, జిల్లా కార్యదర్శి కొండబాబు, సర్పంచ్ ఆది సత్తిబాబు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందించాలి


రైతులకు యూరియా బస్తాలను అందజేస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ

దేవరాపల్లి: ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన యూరియాను రైతులకు సకాలంలో అందించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఎ. కొత్తపల్లి రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ సమక్షంలో ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా బస్తాలను మంగళవారం రైతులకు అందజేశారు. ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఉపసర్పంచ్ సరువులునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రణయ్ పాల్గొన్నారు.

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సత్కారం


చింతలపూడిలో బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: చింతలపూడి సచివాలయం పరిధిలో ఇటీవల బదిలీ అయిన ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేశారు. తామరబ్బ పంచాయతీలో సర్పంచ్ టోకురి రామకృష్ణ ఆధ్వర్యంలోను, చింతలపూడి పంచాయతీలో సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా, డిజిటల్ అసిస్టెంట్ వరలక్ష్మి, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఉద్యానవన సహాయకుడు డి.వరుణ్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బండి గౌరమ్మ, చింతలపూడి ఉప సర్పంచ్ గలేరి గంగరాజు, తామరబ్బ ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, గుమ్మడపు మహేష్, పంచాయతీ కార్యదర్శులు నారాయణరావు, ఈశ్వరరావు, రిటైర్డ్ పంచాయతీ సెక్రటరీ ఎల్.లింగన్న, గ్రామ పెద్దలు, ప్రజలు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరవోలు ఆవ అభివృద్ధికి కృషి


కొమరవోలు ఆవను సందర్శించిన ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : కొమరవోలు ఆవ అభివృద్ధికి కృషి చేస్తానని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు అన్నారు. మంగళవారం ఆయన ఆవను సందర్శించారు. ఆవ నీటి సంఘం అధ్యక్షుడు పోతల శ్రీనుతో ఆయకట్టు రైతులు, ఆవలో నీటి సామర్థ్యం గురించి చర్చించారు. ఆయకట్టు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. సాగునీరు నిల్వ సామర్థ్యానికి అవసరమైన అభివృద్ధి పనులు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా నీటిని విడుదల చేశారు. దీని ఆయకట్టు 1600 ఎకరాలకు ఉంటుందని, రైతులు దీనిని మనస్పర్ధలు రాకుండా సాగునీరు వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

30 మందికి ఉచిత కంటి పరీక్షలు

రావికమతం : గుమ్మాలపాడు గ్రామంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి వచ్చిన 30 మంది రోగులకు వైద్యులు చిట్టిబాబు కంటి పరీక్షలు చేశారు. వారిలో ముగ్గురికి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్టు ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.


కుసుర్లపూడి పంతులుబాబు ఆశ్రమం దాటిన తరువాత ప్రమాదకరంగా ఉన్న ఎస్ కార్నర్


తమనారపాలెం వద్ద ప్రమాదకరంగా మలుపు


బుచ్చింపేట నుంచి పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు

మలుపులో పొంచి ఉన్న ప్రమాదాలు

- ఇదీ గ్రామాల్లో రహదారుల పరిస్థితి
- హెచ్చరిక బోర్డులు లేని వైనం
- జంగిల్ క్లియరెన్స్ చేపట్టక ప్రయాణికులకు ఇబ్బందులు

రోలుగుంట : మండలంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ పరిధిలో గల గ్రామాలకు వెళ్లే రోడ్లు తుప్పలు, డొంకలు పెరిగి వాహనచోదకులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్డు కిరువైపులా తక్షణమే జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలకేంద్రం రోలుగుంట నుంచే వెళ్లే అన్ని గ్రామాల రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ప్రధానంగా రోలుగుంట నుంచి కొమరవోలు మీదుగా జానకీరాంపురం, కుసర్లపూడి, జేపీ అగ్రహారం నుంచి నర్సీపట్నం అనకాపల్లి రోడ్డును కలిపే ఈ రోడ్డులో బలిసి ఉన్న తుప్పలు, డొంకలతో పాటు ప్రమాదకర మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపులో ఎదురెదురు వాహనాలు ఢీ కొన్న సంఘటనల్లో పలువురు గాయపడ్డ సంఘటనలు జరిగాయి. అలాగే అర్ల నుంచి వడ్డిప, శరభవరం మీదుగా పాపంపేట, కొవ్వూరు నుంచి మండల కేంద్రం రావాలంటే రోడ్డు పక్కల ఉన్న తుప్పలతో ఇక్కట్లు పడుతూ రోలుగుంట చేరాలి. ఈ మార్గంలో అన్ని ప్రమాదకర మలుపులే. శరభవరం వై.బి.పట్నం నుంచి శరభవరం మీదుగా కొంతల నుంచి నర్సీపట్నం చోడవరం రూట్‌ను కలిపు భోగాపురం చేరే రోడ్డులో కూడా అన్ని తుప్పలు, డొంకలతో కూడిన ప్రమాదకర మలుపులే దర్శనమిస్తాయి. బుచ్చింపేట నుంచి పీహెచ్‌సీ రోడ్డు మీదుగా మునిపల్లి, ఎస్.కొత్తూరు, నిండుగొండ మీదుగా మండల కేంద్రం రోలుగుంట చేరే రూటు ఇరు పక్కలా తుప్పలు. పిచ్చిమొక్కలు బలిసి మలుపు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డులో రోగులను తీసుకెళ్లడానికి వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. కొత్తకోట నుంచి రోలుగుంట మండలం జగ్గంపేట, జె.నాయుడుపాలెం, బల్జిపాలెం, కశిరెడ్డిపాలెంలో కోడ్డులో రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న తుప్పలతో ఎదురెదురుగా వచ్చే వాహనచోద

రోడ్డు పక్క జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి

రోడ్డు పక్కన తుప్పలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయి. ప్రస్తుత వర్షాలకు మరింత ఏపుగా ఎదుగుతున్నాయి. మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలు దృష్టిలో పెట్టుకుని వెంటనే తుప్పలు నరికించాలి.
– లోకవరపు ప్రసాద్, కుసుర్లపూడి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

[illegible] వాహనాలు అదుపు తప్పి ఒకదానిని ఒకటి ఢీకొనే ప్రమాదాలు జరుగుతున్నారు. తుప్పలు తొలగించి మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
– అనిమిరెడ్డి నర్సింగరావు, బుచ్చింపేట

చెట్లు, డొంకలు నరికిస్తాం

రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న తుప్పలు డొంకలు నరికించే చర్యలు చేపడతాం. ప్రజలకు మేలు చేసే పనుల కోసం అధికార యంత్రాంగం పని చేస్తుంది, శానిటేషన్ ప్రోగ్రాంలో ఆర్‌డబ్ల్యూఎస్, శాఖ అధికారులతో కలసి తుప్పలు నరికించే పనులు చేపడతాం. – ఉమామహేశ్వరుడు, జేఈ పీఆర్

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర



నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో అనధికార లేఅవుట్లు, అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. 2025 జూన్ 30వ తేదీ లోపు రిజిష్టర్ అయిన అనధికార లే అవుట్లు, ప్లాట్లు ప్రభుత్వం జీవో జారీ చేసిన 2025 జూలై 26వ తేదీ నుండి 90 రోజులలోపు క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో కానీ, పురపాలక సంఘంలో కానీ, లైసెన్సు పొందిన ఎల్‌టీపీ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొన్ని వారు ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 50 శాతం రాయితీ పొందుతారన్నారు. 45 రోజుల లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ ఛార్జీలపై 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు. 90 రోజుల తరువాత మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ ఛార్జీలపై 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. నిర్ణీత గడువులోగా అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనకపోతే అనధికార లేఅవుట్లు, ప్లాట్లుగా నేరంగా పరిగణించబడతాయన్నారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు విద్యుత్, తాగు నీటి సరఫరా, డ్రైనేజీ మొదలగు వసతులు కల్పించడబవన్నారు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవన్నారు. వీటిని నిషేధిత ఆస్తుల జాబితాలోకి చేర్చడం జరుగుతుందన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ సూచించారు.

చైతన్యంతో సైబర్ నేరాల కట్టడి

నర్సీపట్నం : యువత, విద్యార్థుల్లో చైతన్యంతో సైబర్ నేరాలకు కట్టడి చేయవచ్చని నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సైబర్ నేరాల కట్టడిలో యువత, విద్యార్థులదే కీలకపాత్ర అని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసగాళ్లు ఏటా రూ.వేల కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. బాధితులు నగదు కోల్పోయిన గంటలోపు టోల్‌ఫ్రీ నంబరు1930కు ఫోన్ చేసి సమాచారం తెలియజేస్తే సొమ్ము తిరిగి రాబట్టే అవకాశం ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలు, తెలియని వ్యక్తులు సందేశాల ద్వారా పంపే లింకులపై క్లిక్ చేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని డీఎస్పీ విద్యార్థులకు సూచించారు. డిజిటల్ అరెస్టులు, అధికారుల పేరిట ఎవరైన డబ్బు డిమాండ్ చేస్తే భయపడకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. డ్రగ్స్ రహిత ఏపీ దిశగా కృషి చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గాలంటే విధిగావాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆడపిల్లల రక్షణకు పోక్సోచట్టం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎల్.రేవతమ్మ, జి.గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ఎస్ఎఫ్ఐ బృందం, పాల్గొన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నారుమడులను సంరక్షించుకోవాలి

నర్సీపట్నం : వివిధ తెగుళ్ల నుంచి నారుమడుల సంరక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి డీఆర్సీ సెంటర్ వ్యవసాయ అధికారి పి.విజేత రైతులకు సూచించారు. ఏవో విజయలక్ష్మితో కలిసి ఆమె అప్పన్నదొరపాలెం గ్రామ పరసర ప్రాంతాల్లోని నారుమడులను పరిశీలించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నారుమడుల్లో పాచి, అగ్గి తెగుళ్లతో పాటు జింక్‌లోపం కనబడుతుందని వ్యవసాయ అధికారి తెలిపారు. పాచి తెగులు నివారణకు హెక్సాకొనజోలు 2మిల్లీ. మందు లీటర్ నీటికి, అగ్గి తెగులు ట్రైసైక్లోజోలు ఒక గ్రాము, లీటర్ నీటికి, జింక్ సల్ఫేట్ 8 గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. జీవన ఎరువులు 10 నుంచి 25 కేజీల ఘట్టంలో ఒక లీటర్ కలిపి ఒకరోజు నీడలో అరబెట్టి ఎకరం పొలంలో వేసుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలు కూడా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

రావికమతం : స్మార్ట్ మీటర్లను ఇళ్లకు ఏర్పాటు చేయకుండా ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా మండలంలో చీమలపాడు పంచాయతీ పరిధిలో అజేయపురం, టి.అర్జాపురం పంచాయతీ పరిధిలో పి.కొట్నాబిల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కూటమి నాయకులు, ప్రభుత్వం వచ్చి ఏడాది పాలనలో రూ 15,485 కోట్లు భారం ప్రజలపై ఛార్జీల రూపంలో మోపిందని అన్నారు. ప్రజలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొంగి చంద్రయ్య, సింగారపు వరసయ్య, పాడి బెన్నయ్య పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో శంకరం పంచాయతీ బొడ్డరేవులో అదాని స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిపారు. ఇంటింటికీ కరపత్రాలతో ప్రచారం చేశారు. ఇప్పటికే రూ.300 వచ్చే విద్యుత్ బిల్లులు రూ.500 దాటి వస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు కార్లి భవానీ అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలని సూచించారు.


బొడ్డరేవు గ్రామంలో సీపీఎం నాయకుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ


కె.కోటపాడులో సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రం

కె.కోటపాడు : అదాని స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయరాదని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కె.కోటపాడు సబ్ స్టేషన్ వద్ద మంగళవారం పార్టీ నాయకులు ధర్నా చేసి, అనంతరం సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రాన్ని అందించారు.ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రచారంలో చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. ప్రజా సంఘాల కన్వీనర్ దేముడు, నాయుడుబాబు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం/గొలుగొండ/కె.కోటపాడు/రావికమతం : జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు వెంటనే మంజూరు చేయాలని ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బిఎల్.స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ సెక్రటరీ చినబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్, కార్యదర్శి శ్రీనివాస్‌వర్మ, క్లబ్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే గొలుగొండలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతిపత్రాన్ని అందజేశారు. నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నానాజీ , జిల్లా ఉపాధ్యక్షుడు బీమిరెడ్డి సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ సహాయకార్యదర్శి వరహాలు పాల్గొన్నారు. కె.కోటపాడులో ఆందోళన చేసి తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందించారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా నాయకుడు కె.రాధాకృష్ణ, చోడవరం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మాడుగుల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీయుడబ్ల్యూజె సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఏపీయుడబ్ల్యూజె జిల్లా కార్యదర్శి రొబ్బా శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ పాల్గొన్నారు. రావికమతంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకుడు స్వామి

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు


కొమరవోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చిరంజీవి

రోలుగుంట : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొమరవోలు, పడాలపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సభల్లో మండల వ్యవసాయాధికారి చిరంజీవి ప్రస్తుత నీటి ఎద్దడిలో ఎండిపోతున్న వరి నారుమడులను ఎలా సంరక్షించుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. అన్నదాత సఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో జమకాకుండా ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్సు నమోదు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు వీఆర్వోని సంప్రదించి వారితో ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఇక్కడ అనకాపల్లి వ్యవసాయ వనరుల కేంద్రం నుంచి పాల్గొన్న వ్యవసాయాధికారి పి.విజేత వ్యవసాయ శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించి రైతుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


తల్లిపాలు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

నర్సీపట్నం : పసి బిడ్డకు తల్లి పాలే రక్షణ కవచమని కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ గచ్చపు వీధిలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. తల్లి పాలు ముద్దు..డబ్బా పాలు వద్దు అంటూ..నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని కౌన్సిలర్ సూచించారు. తల్లిపాలు ఆవశ్యకత గురించి సీడీపీవో జి.వి.రమణి తల్లులకు వివరించారు. గచ్చపు వీధి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి కౌన్సిలర్ పద్మావతి చొరవ తీసుకుని 5 సెంట్లు స్థలం మంజూరు చేయించారని సీడీపీవో పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం


డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు కలుషిత ఆహారం, కలుషిత నీరు తాగకుండా ఉండడం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చని, జ్వరం , ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను ఆశ్రయించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలని, ఇంటి పరసరాల్లో కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని దోమ తెరలు వాడాలని సూచించారు. నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి

చలో విజయవాడ గోడ పత్రిక ఆవిష్కరణ

దేవరాపల్లి : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను(పాత పెన్షన్ విధానాన్ని) అమలు చేయాలని దేవరాపల్లి మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దేవరాపల్లి మెయిన్ స్కూల్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. సెప్టెంబర్ 1న చలో విజయవాడ పేరిట నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల మహాసభకు సంభందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు నౌడు అప్పారావు, కొట్నాన రాంబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గందరగోళంగా ఉన్న సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ, పీఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు, గౌరవ అధ్యక్షుడు కృష్ణస్వామినాయుడు, లక్ష్మణరావు, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో చలో విజయవాడ గోడ పత్రిక ఆవిష్కరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు కంచాలు, వాటర్ బాటిళ్ల పంపిణీ


నాతవరం : సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని ఎంఈవోలు ఒ.సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన అంకంరెడ్డి గోవింద్ స్వాతి దంపతుల కుమారుడు శ్రీతన్విక్ ప్రథమ జన్మదినం సందర్భంగా కంచాలు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. హెచ్‌ఎం మృదుభాషిణి, విద్యాకమిటీ చైర్మన్ నాగు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తురకలపూడి ఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి


తురకలపూడిలో మందులను తనిఖీ చేస్తున్న హైమావతి

బుచ్చెయ్యపేట : మండలంలో గల తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రి జిల్లా వైద్యాధికారిణి హైమావతి తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం ఆమె ఆస్పత్రిని పరిశీలించి రికార్డులను, ఆస్పత్రిలో మందుల నిల్వలను తనిఖీ చేశారు. 24 గంటలు ఆస్పత్రి అయిన ఆస్పత్రిలో డెలివరీలు తక్కువగా చేయడంపై వైద్యుడు సునీల్‌ను వివరణ అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుబాటులో ఉండి సరైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వైద్య సిబ్బందికి సూచించారు.

కె.జె.పురం పీహెచ్‌సీలో బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రం ప్రారంభం


కె.జె.పురం పీహెచ్‌సీలో బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో యర్రయ్యమ్మ

మాడుగుల రూరల్ : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని, కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి. యర్రయ్యమ్మ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు, కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభం

మాడుగుల : సత్యవరం నుంచి డి.గొటివాడ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే గల విద్యుత్ స్తంభం ఒరిగిపోతుంది. బలమైన గాలులు వస్తే కిందకి పడిపోయే ప్రమాదం ఉందని, రైతులతో పాటు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేసి ప్రమాదాన్ని నివారించాలని పలువురు కోరుతున్నారు.


ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో 195 బాలురకు, 95 మంది బాలికలకు నర్సీపట్నం ఆఫ్తాలమిక్ అధికారి మోహన్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో 12 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలోనే కళ్లద్దాలు అందజేస్తామన్నారు. కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.